సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 27 । జనవరి । 2025



ఉత్తమ సబ్‌స్టేషన్ గర్భాం

వినియోగదారులకు విద్యుత్ సరఫరా సేవలు అందించడంలో గర్భాం విద్యుత్ సబ్‌స్టేషన్ ఉత్తమ సబ్‌స్టేషన్‌గా ఎంపికైంది.

- 8లో



ప్రతిభకు ప్రశంసలు - 8లో

జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అవార్డులు లభించాయి.



30న మరియగిరి యాత్ర

మండల సమీపంలోని వెంకమ్మచెరువుకు ఆనుకున్న ఉన్న కొండపై వెలిసిన మరియగిరి జాతర ఈ నెల 30న నిర్వహించనున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఆకట్టుకున్న వర్ణచిత్రం



భారతమాత వర్ణచిత్రం

గరుగుబిల్లి: దేశభక్తిని ప్రభోదించే జాతీయ జెండాలో భారతమాత వర్ణచిత్రం పలువురిని ఆకట్టుకొంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నాగూరుకు చెందిన ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన వర్ణచిత్రం పలువురు దేశభక్తి ప్రియులను ఆకర్షించింది. ఈయన ప్రత్యేక దినాలలో నఖచిత్రాలు, వర్ణచిత్రాలను వేస్తుంటారు.

కిచ్చాడలో ఏనుగుల గుంపు



కిచ్చాడ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని కిచ్చాడ గ్రామ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. దీంతో గ్రామాల్లోకి చొరబడతాయేమోనని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

క్రీడా మైదానానికి శంకుస్థాపన



క్రీడా మైదానానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

పూసపాటిరేగ : మండలంలోని కొవ్వాడ గ్రామంలో క్రీడా మైదానం నిర్మాణానికి సర్పంచ్ కోట్ల రామునాయుడు ఆదివారం శంకుస్థాపన చేసారు. తమ సొంత నిధులు రూ.25 లక్షలతో మైదానానికి వివిధ రకాలు పనుల నిమిత్తం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 20 అడుగుల లోతులో వున్న గోతులను కప్పి మైదానం పనులు చేస్తున్నట్లు తెలిపారు. లోతును పూడ్చడానికి సుమారు 3 వేలు లోడులు మట్టితో నింపడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలియజేసారు. కొవ్వాడ గ్రామంలో క్రీడా మైదానం నిర్మాణం గ్రామస్తులు కలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దేబార్కి అప్పారావు, ఉప సర్పంచ్ బండి నర్సయ్యతో వార్డు సభ్యులు, కల్యాణపు హరిబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫోర్ లైన్స్ రహదారి ఏర్పాటుకు చర్యలు



గాంధీ బొమ్మ వద్ద రహదారిని పరిశీలిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రామభద్రపురం: శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం నుంచి వయా రాజాం, బాడంగి, రామభద్రపురం, పార్వతీపురం మీదుగా రాయఘడ వరకు ఫోర్ లైన్స్ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు నుంచి రాజాం వైపు రహదారిని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లిమర్ల నుంచి రామతీర్థం మీదుగా రణస్థలం వరకు విస్తరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రవాణా సౌకర్యం కల్పనే లక్ష్యంగా రహదారులు విస్తరణ చేయనుందని తెలిపారు. రహదారులు విస్తరణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ ఘట్కారీకి విన్నవించగా ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫీజుబిలిటీ కూడా ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో కొన్నింటిని అమలు చేస్తోందని, మిగిలిన పథకాల అమలుపై దృష్టి సారిస్తుందన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం..



పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వేడుకగా రిపబ్లిక్ డే
- జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న శకటాలు

పార్వతీపురం టౌన్: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అంతా సమష్టిగా ముందుకు సాగుదామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 76వ రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. తొలిత వేదికకు చేరుకున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి స్వాగతం పలకగా కలెక్టర్ మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో పోలీసు దళం కలెక్టర్‌కు సెల్యూట్ సమర్పించగా, బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించింది. పరేడ్ కమాండర్ స్వాగతం మేరకు కలెక్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాల గౌరవ వందనాన్ని కలెక్టర్ స్వీకరించారు. అనంతరం అతిథి సభా వేదిక వద్దకు చేరుకోగా పోలీసు దళాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రగతి నివేదికను వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంలో భాగంగా జిల్లాలో ప్రతి రంగంలో కనీసం 15 శాతం ప్రగతికి చర్యలు చేపట్టామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు చేసిన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రతిభా పురస్కారాలు ప్రదానం

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న 487 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి ప్రతిభా పురస్కారాలు అందజేశారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి

కలెక్టర్ వెల్లడించిన ప్రగతి వివరాలు...

- ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ.4 వేలకు పెంచిందన్నారు.
- జిల్లాలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 7,034 దరఖాస్తులు స్వీకరించగా 1157 పరిష్కరించినట్టు చెప్పారు.
- జిల్లాలో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.461 కోట్ల విలువ గల 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు.
- ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు పూర్తి చేసి 84,167 ఎకరాల స్థిరీకరణతో పాటు 12,309 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం, కొత్త ప్రతిపాదనల క్రింద 52,480 ఎకరాల స్థిరీకరణకు, 5,557 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.
- డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పథకం క్రింద 1589 పాఠశాలల్లో చదువుతున్న 91,856 మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాల సంజీవిని కార్యక్రమం క్రింద 10,045 మంది గర్భిణులు, బాలింతలకు ట్యాక్ హోం రేషన్(టీహెచ్ఆర్)గా పౌష్టికాహారం అందిస్తుండగా, 52,617 మంది చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆహారాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.
- జిల్లాలో 2001 గ్రామాలు, ఆవాసాలకు తాగు నీటిని సరఫరా చేసేందుకు రూ.1462 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు.
- ఉపాధి పథకం కింద జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఒక కోటి ఏడు లక్షల పని దినాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ పని దినాలు కల్పించడం వలన రూ.268 కోట్ల వేతనంగా వేతనంగా చెల్లించామన్నారు.
- పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.211 కోట్లతో 472 పనులు మంజూరు కాగా ఇప్పటికే 102 కోట్ల రూపాయల ఖర్చు చేయడం జరిగిందన్నారు.
- విద్యుత్ సౌకర్యం లేని పీవీటీజీ గ్రామాలకు 3.45 కోట్ల రూపాయల వ్యయంతో 3,400 కనెక్షన్లను విడుదల చేయగా, ఇతర గిరిజన గ్రామాలకు రూ.2.16 కోట్ల వ్యయంతో 3351 కనెక్షన్లు విడుదల చేయడం జరిగిందన్నారు.
- జిల్లాలో 13 జాబ్‌మేళాలు నిర్వహించి 739 మంది యువతకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలోని ఒక నైపుణ్య కళాశాల, 4 నైపుణ్య అభివృద్ధి కేంద్రాల్లో 400 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు

ఐటీడీఏ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



గిరిజనాభివృద్ధికి ఐటీడీఏ పెద్దపీట : పీఓ

- గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

సీతంపేట: గిరిజనాభివృద్ధికి ఐటీడీఏ పెద్దపీట వేస్తుందని పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో రిపబ్లిక్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. పీఓ గౌరవ వందనం స్వీకరించారు. జీసీసీ, ఉద్యానవన శాఖ, ట్రైబుల్ వెల్ఫేర్, వెలుగు, ఐసీడీఎస్ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఎంతోగానో ఆకట్టుకున్నాయి. పీఓ స్టాల్స్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా అనేక అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో త్వరలో నాలుగో తరగతి ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రహదారులు, మంచినీరు, విద్యుత్ ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్టు వెల్లడించారు. మెరుగైన వైద్యసేవలు అందించనున్నామన్నారు. ఉద్యానవన తోటల పెంపకంలో భాగంగా పైనాపిల్‌ను ప్రోత్సహించడానికి మారిషస్ పైనాపిల్‌ను ఈ ప్రాంతంలో పరిచయం చేశామన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, ఈఈ రమాదేవి, డిప్యూటీ ఈఓ ప్రసన్నకుమార్, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, ఏఎంఓ కోటిబాబు, ఏఈ నాగభూషణరావు, హెచ్‌ఓ పి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రత్యేక ఆకర్షణగా డాగ్ షో



జాగిలాల ప్రదర్శన

బిందు, లైకా, శాండీ పేరు గల పోలీసు జాగిలాలు (డాగ్స్) చేసిన ప్రదర్శన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముందుగా బిందు జాగిలం కలెక్టర్‌కు నోటితో పుష్పగుచ్ఛాన్ని అందజేసి, సెల్యూట్ చేయగా, లైకా జాగిలం ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని నోటితో అందించి సెల్యూట్ చేసింది. బిందు, శాండీ, లైకా చేసిన ప్రదర్శనలు ఆహుతులను ఆద్యంతం అలరించాయి.

స్టాళ్లను సందర్శించిన కలెక్టర్



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

గణతంత్ర వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. సూక్ష్మ నీటిసాగు పథకం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయ, సంప్రదాయ పంటల ఉత్పత్తి తదితర శాఖలు స్టాళ్లను ఏర్పాటుచేయగా ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి, ఏఎస్పీ డా. ఓ.దిలీప్ కిరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్ఓ కె.హేమలత, కేఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పథక సంచాలకులు వై.సత్యంనాయుడు, డీఐపీఆర్ఓ ఎల్.రమేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి టి.కనకదుర్గ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



పోలీసుల కవాతు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభుత్వ శకటాలు

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా అధికార యంత్రాంగం సమక్షంలో 13 ప్రభుత్వ శాఖలు పది శకటాలను ప్రదర్శించాయి. వీటిలో పాఠశాల విద్య, ఇంజినీరింగ్ శాఖలు, ఏపీఈపీడీసీఎల్ శకటాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి.



ప్రథమ స్థానం సాధించిన విద్యాశాఖ శకటం



ద్వితీయ స్థానం సాధించిన ఇంజనీరింగ్ శకటం



తృతీయ స్థానంలో నిలిచిన ఏపీఈపీడీసీఎల్ శకటం

అమ్మ తొలేళ్ల సంబరానికి సర్వం సిద్ధం

- నేడు తొలేళ్ల ఉత్సవం
- ఘనంగా కారుగేద వాలకం
- పశువులేర్లుతో గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర
- లడ్డూ ప్రసాదం సిద్ధం

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ముద్దుబిడ్డ శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం జరగనుంది. జాతరకు ఇతర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. జాతరకొచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ్, ఈఓ వి.వి.సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లు చేశారు.

ఘనంగా కారుగేద వాలకం

శంబర గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్తులు ఘనంగా కారుగేద వాలకం నిర్వహించారు. గ్రామానికి చెందిన చెల్లూరి రాములు ఉదయం నుంచి ఉపవాసం ఆచరించి, వరిగడ్డితో శరీరమంతా కప్పుకొని, యాదవవీధికి చేరుకున్న అమ్మవారి ఘటాలకు నమస్కరించారు. స్త్రీ వేషధారణలో ఓ వ్యక్తి వచ్చి రాములును అమ్మవారి ఘటాల నుంచి తీసుకువెళ్లడం ఆనవాయితీ.

మురుగ్గా పారిశుద్ధ్య పనులు

గ్రామంలోని అన్ని వీధుల్లో ఆదివారం పంచాయతీ కార్యదర్శి గణేష్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేశారు. పలు మున్సిపాల్టీల నుంచి ఆదివారం 60మంది చేరుకోగా, మరో 50మంది వరకు సోమవారం చేరుకోనున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.



చదురుగుడిలో పోలమాంబ అమ్మవారు

700 మందితో పోలీస్ బందోబస్తు

జాతరలో 700మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. 41సీసీ కెమెరాలు, డ్రోన్లతో పోలీస్ ఉన్నతాధికారులు కంట్రోల్‌రూమ్ నుంచి జాతర పర్యవేక్షించనున్నారు. జాతరలో ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, పీసీలు, రోప్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారు. జాతరకొచ్చే భక్తుల అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా రోడ్డుమ్యాప్‌ను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చిన భక్తులు 100 నంబర్‌కు ఫోన్ చేస్తే, రూట్ పెట్రోలింగ్ పార్టీ చేరుకొని, ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారు.

30వేల లడ్డూ ప్రసాదం సిద్ధం

శంబర పోలమాంబ అమ్మవారి జాతర 10 వారాల పాటు జరగనుంది. తొలి జాతరకు వచ్చే భక్తులకు 30వేల లడ్డూ ప్రసాదం, అవసరమైన మేరకు పులిహోర ప్రసాదాన్ని తయారుచేయించారు. ఉచితం, 20, 100 రూపాయిల టిక్కెట్లు ద్వారా అమ్మవారిని దర్శించుకునే భక్తులకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతరలో దేవదాయ శాఖ సిబ్బంది 60మంది వరకు విధులు నిర్వహించనున్నారు. భక్తుల కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు, దుస్తులు మార్పిడి గదులు నిర్మించారు. క్యూలైన్లు వద్ద చిన్నారులుకు పాలు అందించనున్నారు. మంచినీరు అందుబాటులో ఉంచారు.

ఐదు చోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు

శంబర గ్రామానికి చేరుకునే వాహనదారులకు ఐదు చోట్ల పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. మక్కువ నుంచి కవిరిపల్లి గ్రామం మీదుగా శంబర గ్రామానికి కేవలం ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు రాకపోకలకు మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. మిగిలిన ఆటోలు, ఇతరత్ర వాహనాలను మక్కువ మీదుగా చెముడు గ్రామం నుంచి శంబర చేరుకోవాల్సి ఉంది. సన్యాసిరాజపురం, కవిరిపల్లి, తోటవలస గ్రామాలలో ముత్యాలమ్మ పండగ జరగనున్న నేపథ్యంలో ఆయా గ్రామాలకు బంధువులు చేరుకోవాలంటే పోలీసులు అనుమతితో వెళ్లనున్నారు. కవిరిపల్లి మీదుగా శంబర చేరుకున్న వాహనదారులకు శంబర పీహెచ్‌సీ పక్కన, చెముడు మీదుగా చేరుకున్న వాహనాలకు గోముఖీ నది వద్ద, మామిడిపల్లి మీదుగా వచ్చే వాహనాలు వీఆర్ఎస్ ప్రాజెక్ట్ వద్ద, మావుడి నుంచి చేరుకునే వాహనాలు హాస్టల్ వద్ద, ఎస్.పెద్దవలస మీదుగా వచ్చే వాహనాలకు గ్రామ శివారులో స్థలాలను కేటాయించారు.

గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర

శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం కార్యక్రమానికి అవసరమైన సిరిమాను, గుజ్జుమాను కర్రలను ఆదివారం రైతులు పశువులేర్లుతో గ్రామానికి తీసుకువచ్చారు. సాలూరు మండలం కందులుపదం గ్రామానికి చెందిన రైతులు తీళ్ల అచ్యుతరావు, సిద్ధయ్య పొలంలో సిరిమాను కర్రను గుర్తించారు. సుమారు 35 అడుగుల పొడవు సిరిమాను కర్రను తీసుకువచ్చారు.



పశువులేర్లుతో తీసుకువస్తున్న సిరిమాను కర్ర

అమ్మవారి ఘటాలకు భక్తుల పూజలు

చదురుగుడిలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 3.30గంటల సమయంలో చదురుగుడి నుంచి అమ్మవారి ఘటాలు గ్రామంలోకి తిరువీధికి బయల్దేరగా, భక్తులు అమ్మవారి ఘటాలకు, పాలధారకు పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

సేవలకు గుర్తింపుగా పురస్కారం



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వెంకటమహేష్

పార్వతీపురం: ఉత్తమ సేవలను అందించినందుకుగాను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఆర్.వెంకట మహేష్ పురస్కారం అందుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా కోఆర్డినేటర్ వెంకట మహేష్‌కు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ పురస్కారం అందజేశారు.

రామవరం సర్పంచ్ జాతీయ పురస్కారం



ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ దంపతులు

సీతానగరం: మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ పెంట సత్యం నాయుడు జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌గా కేంద్రప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గ్రామపంచాయతీని అభివృద్ధి చేయడంలో ప్రతిభను కనబరచడం వల్ల కేంద్ర ప్రభుత్వం రిపబ్లిక్ డే సందర్భంగా సర్పంచ్ దంపతులతో పాటు పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావును అభినందించింది.

ఎక్సైజ్ ఎస్సై యు.నాగేశ్వరరావుకు రాష్ట్రస్థాయి అవార్డు



ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎక్సైజ్ ఎస్సై యు.నాగేశ్వరరావు

పార్వతీపురంటౌన్: ఎక్సైజ్ ఎస్సై యు.నాగేశ్వరరావుకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను అవార్డుకు ఎంపిక చేశారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడలో ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్ చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. ఆయనకు అవార్డు రావడం పట్ల ఎక్సైజ్ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వీరఘట్టం: పదో తరగతి విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ రత్నాకరరావు సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 17 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇంటి వద్ద ప్రశాంతంగా చదువుకునేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. టీవీలు, సెల్‌ఫోన్లకు విద్యార్థులను దూరంగా ఉంచాలని సూచించారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

వీరఘట్టం: సురక్షిత ప్రయాణాలకు వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. వీరఘట్టం, నడుకూరు, విక్రమపురం, నడిమికెల్ల గ్రామాల్లో రోడ్డు పక్కనే పాఠశాలలు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో వాహనదారులు పరిమిత వేగంతో రాకపోకలు సాగించాలని సూచించారు.

ప్రతిభకు ప్రశంసలు

• అవార్డులు అందుకున్న అధికారులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అవార్డులు లభించాయి. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి చేతుల మీదుగా పలువురు అధికారులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అందుకున్న వారి వివరాలిలా..



ఎస్ఎస్ శోభిక, జాయింట్ కలెక్టర్; అశితోష్ శ్రీవాత్సవ, సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీఓ; కె. హేమలత, డీఆర్ఓ; కె. రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి; ఎస్. మన్మథరావు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి; పి.శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ డీఎం; కె.రామచంద్రరావు, డ్వామా పీడీ; డి.మంజులావీణ, డీఈఈఓ; డాక్టర్ బి.వాగ్దేవి, డీసీహెచ్ఎస్; వై.మణి, జిల్లా మలేరియా అధికారి; పి.వీర్రాజు, జిల్లా ప్లానింగ్ అధికారి; ఎస్.తిరుపతిరావు, డీఈఓ; ఎండీ గయాజుద్దీన్, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి; ఎం.శశికుమార్, ఎంవీఐ; ఆర్.రామగోపాల్, సీఈఓ సెట్విజ్



షేక్ ఆశ, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి; ఎం.సావిత్రి, ఏఓ కలెక్టరేట్; జి. శ్రీరామ్మూర్తి, సూపరింటెండెంట్ కలెక్టరేట్; బి.శివ జగన్‌మోహన్, సీసీ-సీడీఎం; పి. చిట్టమ్మ, ఆర్‌డీటీ; జి. అనిల్‌కుమార్, దఫేదార్; ఎన్. సునీత, ఎస్ఏ-సబ్‌కలెక్టర్ ఆఫీస్; డి. గుణశేఖర్, సీసీ సబ్‌కలెక్టర్; డి.రవి, తహసీల్దార్ పాచిపెంట; కె. రత్నకుమారి, హెచ్‌డీటీ బలిజిపేట; ఎ. ఉమామహేశ్వరరావు, హెచ్‌డీటీ సీతానగరం; ఒ.దిలీప్ కిరణ్, అదనపు ఎస్పీ; డి. అనిల్ కుమార్, ఎస్సై బత్తిలి; పి. నారాయణరావు, ఎస్సై కురుపాం; కె.మురళీధర్, సీఐ, పార్వతీపురం; పి. రామకృష్ణ, సీఐ



ఎం. రాజేష్, ఎస్సై; కె. వెంకట సురేష్, ఎస్సై; షేక్ ఫక్రుద్దీన్, ఎస్సై; బి. రవీంద్రరాజు, ఎస్సై; వీఎస్‌వీఆర్ సీహెచ్ నాయుడు, ఆర్ఐ; ఎం. మల్లేశ్వరావు, ఏఆర్ ఎస్సై; ప్రవీణ్ సాహు, ఏఆర్‌పీసీ; పి. సత్యనారాయణ, ఎస్సై; కె. హేమలత, ఏజీఎం స్త్రీనిధి; డాక్టర్ పి.మాణిక్యరావు, ఎ.డి పశుసంవర్ధక శాఖ; డాక్టర్ బి.చక్రధర్, పశువైద్యాధికారి; డాక్టర్ ఎస్. రామారావు, పశువైద్యాధికారి; డాక్టర్ పల్ల శ్రీధర్, పీహెచ్‌సీ మాదలంగి; డా. వై. మోహన్, మెడికల్ ఆఫీసర్; డా. కె. రవీంద్ర, సీహెచ్, బత్తిలి; ఎన్. రూపీ, ఎల్‌టీ, జిల్లా ఆస్పత్రి



వి. గణేష్ కుమార్, ఆర్ఎస్ డీటీ; జి.దాసు, ఎక్సైజ్ సీఐ, సాలూరు; జె. రాజశేఖర్, ఎస్సై, కురుపాం; వి. మహేంద్రకుమార్, డీఎంజీసీసీ; ఎస్.గౌరీశ్వరి, ఓఎస్, డీపీఆర్ఓ ఆఫీసు

ఐటీడీఏ పీఓ ద్వారా ప్రశంసలు

సీతంపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీతంపేట ఐటీడీఏ పీఓ పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రశంసలు అందుకున్న వారి వివరాలు..



చిన్నబాబు, ఏపీఓ; ఎస్‌వీ గణేష్, పీహెచ్‌ఓ, ఉద్యాన వనశాఖ



సీతంపేట: ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీడీ అన్నదొర

రాష్ట్రస్థాయిలో ఉత్తమ సబ్‌స్టేషన్ గర్భాం



ఏపీ ట్రాన్స్‌కో చైర్మన్, ఎం.డి చక్రధర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఈఈ మారుతి ప్రసాద్

మెరకముడిదాం: వినియోగదారులకు విద్యుత్‌సరఫరాలో సేవలు అందించడంలో గర్భాం విద్యుత్‌సబ్‌స్టేషన్ ఉత్తమసబ్‌స్టేషన్‌గా ఎంపికైంది. దీనికి గాను విజయవాడలో ఏపీ ట్రాన్స్‌కో చైర్మన్, ఎం.డి చక్రధర్ చేతుల మీదుగా ఏపీ ట్రాన్స్‌కో ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ మారుతిప్రసాద్ అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది నిరంతరం అలుపెరుగని సేవలను అందించడం వల్ల ఈ రోజు రాష్ట్రస్థాయిలో సబ్‌స్టేషన్‌కు అవార్డు దక్కిందన్నారు.

మన్యంలో మరో చిన్నారి మృతి

శృంగవరపుకోట: మన్యంలో మృత్యుఘోష ఆగడం లేదు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యమో, గిరిజనం శాపమో కానీ చిన్నారులు ప్రాణాలు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. ఆదివారం మండలంలోని గిరిశిఖర గ్రామంలో మరో చిన్నారి తనువు చాలించాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుని తల్లిదండ్రులు చిన్నాలమ్మ, దేవా, ఏపీ గిరిజన సంఘ నాయకులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో దారపర్తి పంచాయతీ చిలకపాడు గ్రామానికి చెందిన ఏడాది వయసున్న బాలుడు జన్ని విజయ్‌కు ఇటీవల టీకా వేయించారు. తర్వాత బాలుడికి జ్వరం రావడంతో కొండ కింద ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చి వైద్యం చేయించారు. వైద్యులు విజయనగరం ఘోషాఆస్పత్రికి వెళ్లాలని సూచించడంతో తీసుకెళ్లి వైద్యం చేయించారు. శనివారం సాయంత్రం వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో గ్రామానికి తీసుకొచ్చారు. కాగా ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో చిన్నారి విజయ్ మరణించాడు. దీంతో ఒక్కసారిగా గ్రామంలో విషాదం అలుముకుంది. వైద్యసిబ్బంది గ్రామాల్లోకి రాకపోవడం వల్లనే తమకు ఈ పరిస్థితి వస్తోందని గిరిజనులు చెబుతున్నారు.

30న మరియగిరి యాత్ర



నవదిన పూజల్లో పాల్గొన్న క్రైస్తవ భక్తులు

• ప్రారంభమైన నవదిన పూజలు

వీరఘట్టం: మండల సమీపంలోని వెంకమ్మచెరువుకు ఆనుకున్న ఉన్న కొండపై వెలిసిన మరియగిరి జాతర ఈ నెల 30న నిర్వహించనున్నారు. ఇందు కోసం యాత్రా ప్రాంగణంలో జరగబోయే దివ్య పూజ కోసం ప్రార్థనా మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ మేరకు ఉత్సవానికి తొమ్మిది రోజుల ముందు నుంచి చేపట్టబోయే నవదిన పూజలు ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవదిన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన పూజల్లో వీరఘట్టం, చిట్టిపూడివలస, సివిని, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి, తూడి, పాలకొండ, వంగర, తలవరం, సంకిలి, నవగాం, పాలవలస గురు మండలాల పీఠాధిపతులు పాల్గొన్నారు. 30వ తేదీ ఉదయం నడుకూరు ఆర్‌సీఎం చర్చి నుంచి మరియగిరి శిఖరం వరకు మేరిమాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి, దివ్య పూజను చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 30 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలందుకుంటున్న మేరిమాత

ఏర్పాట్లు పూర్తి..

ఈ నెల 30న జరగనున్న మేరీమాత ఉత్సవం కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నడకదారిలో అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఈ నెల 29 వరకు నవదిన పూజలు జరుగుతాయి.

– విజయ్‌రెడ్డి, ఫాదర్, మరియగిరి

రెండు పశువుల లారీల సీజ్

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామం సమీపంలో జాతీయ రహదారి గుండా అక్రమంగా రెండు లారీలతో తరలిస్తున్న 19పశువులను శనివారం రాత్రి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసును నమోదు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు.

శంబర జాతర సందర్భంగా 130 ప్రత్యేక బస్సులు

• జిల్లా ప్రజా రవాణా అధికారి కె. శ్రీనివాస్



జిల్లా ప్రజా రవాణా అధికారి కె. శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 130 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.పార్వతీపురం, సాలూరు, పాలకొండ, విజయనగరం, ఎస్‌కోట, శ్రీకాకుళం-2 డిపోల నుంచి శంబర వరకు వయా చినభోగిలి, దిబ్బగుడివలస, మామిడిపల్లి, వైఎస్ వలస మీదుగా బస్సులను ఏర్పాటు చేశామన్నారు. 27వ తేదీన పార్వతీపురం డిపో నుంచి 5బస్సులు, సాలూరు డిపో నుంచి 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 28వ తేదీన పార్వతీపురం నుంచి శంబర 25 బస్సులు, సాలూరు నుంచి శంబర 25 బస్సులు, రాజాం నుంచి శంబర 10 బస్సులు, బొబ్బిలి నుంచి శంబర 20 బస్సులు, విజయనగరం నుంచి శంబర 20 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. 29వ తేదీన పార్వతీపురం నుంచి శంబర 5 బస్సులు, సాలూరు నుంచి శంబర 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సులన్నీ సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. భక్తులంతా ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని కోరారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



గుర్ల: పంచాది శివ (ఫైల్)

గుర్ల: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందనే బాధను తట్టుకోలేక మనస్తాపానికి లోనైన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్ల మండలంలోని కెల్లలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పంచాది శివ (31) మద్యానికి బానిసకావడంతో రెండు నెలల క్రితం భార్య వెంకటలక్ష్మి తన పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పాటు అప్పుల బాధలు ఎక్కువవడంతో మనస్తాపం చెందిన శివ గడిచిన ఆదివారం గడ్డి మందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి కుమార్తె తేజ, కుమారుడు శరత్ ఉన్నారు. ఎస్సై నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని మరో వ్యక్తి..



సంతకవిటి: గెంబలి తవిటిరాజు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు గ్రామానికి చెందిన గెంబలి తవిటిరాజు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. తవిటిరాజు గ్రామంలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి వ్యాపారంలో నష్టం వాటిల్లడంతో అప్పుల వారు ఇంటికి వచ్చి అడుగుతూ ఉండడంతో గురువారం మధ్యాహ్నం ఇంటిలో ఉరివేసుకోగా కుటుంబసభ్యులు గమనించి వెంటనే రాజాంలోని ఓ ఆస్పత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య కల్యాణి ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించినట్లు చెప్పారు.

జెడ్పీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం



జెడ్పీ కార్యాలయంలో జెండా వందనంలో పాల్గొన్న సీఈఓ సత్యనారాయణ, చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు


విజయనగరం రూరల్: సాంకేతిక యుగంలో సమర్థత, నైపుణ్యాలు పెంచుకుంటూ ప్రగతి పూర్వక అభ్యుదయంలో ప్రయాణం చేస్తున్న భారతీయులందరికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కులకు దారి దస్తూరి

• విద్యార్థుల దృష్టి అవసరం



పదవ తరగతి విద్యార్థులు



బలిజిపేట: చేతిరాతను బట్టి తలరాత ఉంటుందనేది నానుడి. చేతిరాతను బట్టి మన మనస్తత్వాన్ని, గుణగణాలను అంచనా వేయవచ్చని భావిస్తారు. అక్షరాలు అందంగా, గుండ్రంగా, ఆకర్షణీయంగా ఉంటే వాటిని చూసిన వారు ఎవరైనా ముచ్చటపడతారు. విద్యార్థులు మంచి మార్కులు పొందాలంటే చేతిరాత ఎంతో బాగుండాలి. మార్చిలో ఇంటర్మీడియట్, ఏప్రిల్‌లో పదవతరగతి పరీక్షలు వస్తున్న నేపథ్యంలో చేతిరాతపై విద్యార్థులు దృష్టిసారించడం మంచిదని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి తర్ఫీదు అందిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటర్, పది పరీక్షలు సమీపిస్తున్నాయి. వాటి తరువాత ఇతరత్రా చదువులు చదువుకుంటున్న వారి పరీక్షలు సమీపిస్తున్నాయి. చెప్పాలంటే తక్కువ సమయం ఉంది. ఇటువంటి సమయంలో విద్యార్థులు మార్కులు, గ్రేడులు సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటారు. ఎంతకని చదువుతోనే మార్కులు సంపాదిద్దామని అనుకుంటారు కానీ చేతిరాత గురించి పట్టించుకోరు. దీనివల్ల అనుకున్న మార్కులు పొందలేకపోతుంటారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంచుకుంటే మంచిరాత వస్తుంది, మంచి మార్కులు పొందవచ్చు. కష్టపడి చదివిన పాఠ్యాంశాల నుంచి పరీక్షలలో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు రాసేటప్పుడు విద్యార్థి అందంగా రాసే సమాధానాలపై ఎన్ని మార్కులు వస్తాయనేది ఆధారపడి ఉంటుంది.

స్పష్టంగా రాయాలి

- ప్రతి విద్యార్థి జవాబు పత్రాల్లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- పేపరుకు నాలుగు వైపులా బోర్డర్ వేసుకుంటే చూసేందుకు అందంగా ఉంటుంది.
- పరీక్షల్లో రాసే అక్షరాలు ఒకేలా ఉండాలి.
- అక్షరాలు మరీ పెద్దవి, చిన్నవిగా ఉండకూడదు.
- పేపరంతా ఒకే స్థాయిలో అక్షరాలు ఉండాలి. చేతిరాత బాగుంటే జవాబు పత్రాలను దిద్దే ఉపాధ్యాయుడు ప్రభావితమవుతాడు.
- అక్షరాలు గుండ్రంగా, అందంగా ఉంటే మంచి మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది.
- ఒక లైనుకు మరో లైనుకు సెంటీమీటరు గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి, పదానికి తగినంత(ఒకటి లేదా రెండు అక్షరాలు) స్పేస్ ఇవ్వాలి.
- వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి. బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై పడుతుంది.

రోజూ ప్రాక్టీస్ చేయాలి

ఇటు సబ్జెక్టులకు సన్నద్ధం అవుతూ మరోవైపు రోజులో కొంత సమయం చేతిరాతపై దృష్టిసారిస్తే రాతపై పట్టు వస్తుంది. అందుకుగాను పదవ తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో ఒరవడి రాయిస్తున్నారు.

దస్తూరితో ఆకర్షిలవుతారు



చేతిరాత అందంగా ఉండడం విద్యార్థులకు ఎంతో అవసరం. మంచి మార్కులు రావాలంటే చేతిరాత బాగుండాలి. దస్తూరీ బాగుంటే మంచి మార్కులు వస్తాయి. పేపర్లు దిద్దేవారు ఆకర్షితులవుతారు. సాధనతోనే చక్కటి చేతిరాత వస్తుంది. పునాది నుంచి ఇది అవసరం.

– ఎం.గౌరీశంకరరావు, ప్రధానోపాధ్యాయుడు, చిలకలపల్లి ఉన్నత పాఠశాల, బలిజిపేట మండలం